సాక్షి నిజామాబాద్

ఆదివారం । 17 । డిసెంబర్ । 2023



బిల్లుల మంజూరు కోసం..

గత ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పనుల బిల్లులు మంజూరు చేయాలని కాంట్రాక్టర్లు అధికారులను వేడుకుంటున్నారు.

- 8లో ▸



నేరస్తులకు శిక్షపడాలి

నేరస్తులకు న్యాయపరంగా శిక్షపడేలా పీపీలు వాదించాలని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనర్సయ్య పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం

29.3 /16.4

వాతావరణం

ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లటిగాలులు వీస్తాయి. సాయంత్రం నుంచి చలితీవ్రత పెరుగుతుంది. రాత్రి కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

జిల్లా జైలును సందర్శించిన లీగల్ ఎయిడ్ సభ్యులు



ఖలీల్‌వాడి : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లీగల్ కౌన్సిల్ బృందం శనివారం జిల్లాలోని సారంగపూర్ జిల్లా జైలును సందర్శించింది. ఈ సందర్భంగా జైలులో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ రాజ్‌కుమార్ సుబేదార్ మాట్లాడుతూ ఖైదీలకు న్యాయసాయం అవసరమైతే లీగల్ డిఫెన్స్ కౌన్సెల్ సిస్టం ద్వారా సేవలందిస్తామన్నారు. ఖైదీలు సంబంధిత న్యాయస్థానాల్లో న్యాయమూర్తులకు తెలియపరిస్తే వారికి సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో డిఫెన్స్ కౌన్సిల్ ప్రమో ద్, జైలు సూపరింటెండెంట్ జి ప్రమోద్ కుమార్, రాజశేఖర్, సాయి కుమార్, ఖైదీలు జైలు సిబ్బంది పాల్గొన్నారు.

షకీల్ రైస్ మిల్లుల్లో కొనసాగుతున్న తనిఖీలు



బోధన్ : బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌కు సంబంధించిన రైస్‌మిల్లుల్లో రాష్ట్ర సివిల్ సప్లయ్స్ టాస్క్‌ఫోర్స్ అధికారులు, జిల్లా బృందాలు రెండో రోజు శనివారం తనిఖీలు కొనసాగించాయి. సాలూర మండలంలోని తగ్గెల్లి శివారులో ఒకే చోట ఉన్న మూడు రైస్‌మిల్లులు, కుమ్మన్‌పల్లి శివారులోని మరో రైస్ మిల్లులో అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. టాస్క్‌ఫోర్స్ అధికారులు రైస్‌మిల్లులో, గోదాములో వేర్వేరుగా తనిఖీలు చేస్తున్నారు. గత సీజన్లలో సీఎంఆర్ కోసం మాజీ ఎమ్మెల్యే షకీల్‌కు సంబంధించిన రైస్ మిల్లులకు సుమారు 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇచ్చినట్లుగా తెలుస్తోంది. మిల్లింగ్ చేసి సివిల్ సప్లయ్ శాఖకు బియ్యం తిరిగి ఇవ్వాల్సి ఉండగా భారీగా పక్కదారి పట్టినట్లు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. దీంతో సివిల్ సప్లయ్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ విషయం సివిల్ సప్లయ్ శాఖ జిల్లా మేనేజర్ జగదీశ్‌ను వివరణ కోరగా రైస్‌మిల్లులు, గోదాముల్లో బియ్యం, ధాన్యం నిల్వలను తనిఖీ చేస్తున్నామన్నారు. తనిఖీలు పూర్తయితే పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. తనిఖీల్లో డీఎస్‌వో చంద్ర ప్రకాశ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

మోపాల్ : మోపాల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న నర్సింహామూర్తిని సస్పెండ్ చేస్తూ సీపీ కల్మేశ్వర్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. నగరంలోని తన నివాసానికి ఆనుకుని ఉన్న ఏఆర్ ఇన్‌స్పెక్టర్ భార్యతో మూర్తి భార్యకు గొడవ జరిగిందని సమాచారం. వీరిరువురి మధ్యలో జోక్యం చేసుకోవడమే కాకుండా అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని ఏఆర్ ఇన్‌స్పెక్టర్ సీపీకి ఫిర్యాదు చేశారు. విచారణ చేయించిన సీపీ నర్సింహామూర్తిని సస్పెండ్ చేశారు. మూర్తి ఎనిమిది నెలలుగా మోపాల్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా స్టేషన్‌లో ఫిర్యాదుదారులపై కూడా దురుసుగా ప్రవర్తిస్తున్నాడనే ఆరోపణలు కూడా మూర్తిపై ఉన్నాయి.

యువత సమాజానికి ఆదర్శంగా నిలవాలి



ఖలీల్‌వాడి: యువత సమాజానికి ఆదర్శంగా నిలవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో జిల్లా ట్రాఫిక్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రాఫిక్ అవగాహన సదస్సుకు జడ్జి హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ లైసెన్స్ పొందాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదాలపై లఘు చిత్ర ప్రదర్శించారు. సదస్సులో జిల్లా అదనపు జడ్జి పద్మావతి, అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ జయరా, ఏసీపీ రవీందర్ రెడ్డి, మేఘన డెంటల్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్ కుమార్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రాజశేఖర్ ఉన్నారు.

సూపరింటెండెంట్ వచ్చేనా!

- జిల్లా జనరల్ ఆస్పత్రికి ఆది నుంచి ఇన్‌చార్జీలే దిక్కు
- సీనియర్లు ఉన్నప్పటికీ ఐదేళ్లుగా కొనసాగుతున్న ప్రతిమారాజ్
- సమస్యలతో రోగుల అవస్థలు
- ప్రక్షాళన చేయాలంటున్న ప్రజలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : నిజామాబాద్ జిల్లా జనరల్ ఆస్పత్రిలో పాలన అస్తవ్యస్తంగా తయారైంది. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో మంత్రి సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో డీఎస్ షష్టిపూర్తిని పురస్కరించుకుని మెడికల్ కళాశాలను ప్రారంభించగా దానికి అనుబంధంగా జీజీహెచ్ ఉంది. అయితే ఐదేళ్లుగా జీజీహెచ్‌కు ఇన్‌చార్జీగా ఉన్న సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ ఏకపక్షంగా వ్యవహరిస్తుండడంతో ఆస్పత్రిలో సమస్యలకు పరిష్కారమనేది లేకుండా పోయింది. రెగ్యులర్ సూపరింటెండెంట్ అర్హత ఉన్నవారిని కాదని ప్రతిమారాజ్ మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అండతో సూపరింటెండెంట్‌గా కొనసాగుతున్నారు. అయితే ఈ స్థానంలో బాధ్యతలు తీసుకునేందుకు గాంధీ ఆస్పత్రి నుంచి ఏడాదిన్నర క్రితం డాక్టర్ వాలియా అనే అధికారి వచ్చినప్పుడు ఆయనను చార్జ్ తీసుకోకుండానే వెనక్కు పంపేలా చేయడం గమనార్హం. ఇదిలా ఉండగా ప్రతిమారాజ్‌కు ఏడాది క్రితం మాత్రమే ప్రొఫెసర్ హోదా వచ్చింది.

ఇతరులను అడ్డుకుని..

అయితే ఇక్కడే పనిచేస్తున్న వారిలో రెండేళ్ల క్రితం ప్రొఫెసర్ అయిన జలగం తిరుపతిరావు, ఐదేళ్ల నుంచి ప్రొఫెసర్‌గా ఉన్న పీఎల్ శ్రీనివాస్ ఉన్నప్పటికీ వారికి అవకాశం కల్పించకుండా అడ్డుకోవడం విశేషం. ఇక ఇక్కడ బయోమెట్రిక్ లేకుండా చేయడంతో అత్యధిక మంది వైద్యులు హైదరాబాద్ నుంచి ఇష్టం వచ్చినప్పుడు వచ్చి వెళ్తుండడం బహిరంగ రహస్యమే. అటెండెన్స్ నమోదు చేయాల్సిన రెగ్యులర్ ఉద్యోగిని కాదని ఆరోగ్యశ్రీ విభాగంలో పనిచేసే వ్యక్తి నమోదు చేస్తుండడం గమనార్హం. ఇక్కడి న్యూట్రిషన్ కాంట్రాక్టర్ ద్వారానే ప్రతిరోజూ ప్రతిమారాజ్ ఇంటికి కూరగాయలు, అవసరమైనప్పుడు మాంసం సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ప్రక్షాళన చేయాలి



జీజీహెచ్‌లో పరిపాలన అనేది లేకుండా పోయింది. అన్ని అసౌకర్యాలే ఉన్నాయి. అనేక మంది పేషంట్లను ప్రైవేటు ఆస్పత్రులకు పంపి ప్రతిమారాజ్ కమీషన్లు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. పీడియాట్రిక్ విభాగానికి సంబంధించి అనేక కేసులు పంపుతున్నట్లు సమాచారం ఉంది. ఈ విషయమై 30 శాతం కమీషన్లు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే నిజామాబాద్‌లోని హైదరాబాద్ రోడ్డులో ఉన్న ఓ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నుంచి సూపరింటెండెంట్‌కు నెలకు రూ. 2 లక్షలు ముడుపులు అందుతున్నట్లు తెలుస్తోంది. ఇక నాందేవ్‌వాడలో ప్రతిమారాజ్ బినామీ పేరిట మెడికల్ ఏజెన్సీ ఏర్పాటు చేయగా, జీజీహెచ్‌కు అవసరమైన అన్ని వస్తువులు అక్కడే కొనేలా చేశారు. ఈ విధంగా జీజీహెచ్‌ను సూపరింటెండెంట్ సొంత ఆస్పత్రిగా చేస్తుండడం శోచనీయం. ప్రతిమారాజ్ పలు చోట్ల ఆస్తులు, భూములు భారీగా పోగుచేసుకున్నట్లు తెలుస్తోంది. భవిష్యత్‌లో విచారణ జరిగితే చెప్పుకునేందుకు నిజామాబాద్‌లో కివి పేరిట ఆస్పత్రి నడిపినట్లు చూపించడం గమనించాల్సి ఉంది. ఈ ఆస్పత్రిలో అసలు పేషంట్లే లేకపోవడంపై మా ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదు చేస్తా.

– సయ్యద్ ఖైసర్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు



నగరంలోని ఖలీల్‌వాడిలో ప్రాక్టీస్ లేని కివి ఆస్పత్రి

ఇసుక పర్మిట్లు నిలిపివేత!



సుంకెట్ పెద్దవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ (ఫైల్)

- వాగుల నుంచి ఇసుక తవ్వకాలకు బ్రేక్
- పాలసీలో మార్పులపై ప్రభుత్వం నుంచి స్పష్టత కరువు
- అందుకే పర్మిట్లు ఇవ్వడం లేదంటున్న అధికారులు

మోర్తాడ్(బాల్కొండ): జిల్లాలోని వివిధ వాగులు, నది తీర ప్రాంతం నుంచి ఇసుకను తరలించడానికి జారీ చేసే పర్మిట్లను రెవెన్యూ అధికారులు తాత్కాలికంగా నిలిపేశారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇసుక పాలసీలో ఏమైనా మార్పులు చేస్తుందా లేక పాత పాలసీని కొనసాగిస్తారా అనే విషయంలో స్పష్టత లేకపోవడంతో ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో పర్మిట్లు ఇవ్వకూడదని అధికారులు నిర్ణయించారు. జిల్లాలోని పెద్దవాగు, కప్పలవాగుతో పాటు మంజీర, గోదావరి నది తీరాల నుంచి ఇసుకను తరలించడానికి రెవెన్యూ అధికారులు అనుమతులు ఇచ్చేవారు. వారంలో ఒకటి రెండు రోజుల పాటు పర్మిట్లు జారీ చేసి అధికారికంగానే ఇసుకను రవాణా చేయడానికి అనుమతి ఇచ్చేవారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు ఒక ట్రాక్టర్ ట్రిప్‌కు రూ.650, ప్రైవేటు నిర్మాణాలకు అవసరమైన ఇసుకకు ట్రిప్‌కు రూ. 900 డీడీ రూపంలో ప్రభుత్వానికి జమ చేస్తేనే అనుమతులు ఇచ్చేవారు. అనుమతులు ఇవ్వకపోవడంపై రాత్రిపూట వాగుల నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారని గతంలోనే పర్మిట్ల విధానం అమల్లోకి తీసుకొచ్చారు. అంతకు ముందు టెండర్లను నిర్వహించి ఇసుక పాయింట్లను కాంట్రాక్టర్లకు అప్పగించేవారు. ప్రభుత్వ ఖజానాకు జమ చేసిన మొత్తం నుంచి స్థానిక సంస్థలకు కూడా సీనరేజ్ చార్జీల రూపంలో నిధులు విడుదలయ్యేవి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన ఇసుక పాలసీని మారుస్తారా లేక అదే విధానం కొనసాగిస్తారా అనేది కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉంది. అప్పటి వరకు ఇసుక పర్మిట్లు జారీ చేయకూడదని ఉన్నతాధికారులు తహసీల్దార్లను ఆదేశించారు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చే వరకు ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వడం లేదని అధికారులు చెబుతున్నారు.

కొన్ని రోజులు మాత్రమే..

ఇసుక పాలసీపై స్పష్టత వచ్చే వరకు పర్మిట్ల జారీని నిలిపేశాం. ఇది కొన్ని రోజులే.. మళ్లీ ప్రభుత్వం నుంచి స్పష్టత రాగానే ఇసుక రవాణాకు అనుమతులు ఇస్తాం. ప్రభుత్వ ఆదేశాల కోసం వేచి చూస్తున్నాం. తొందర్లోనే ఏదో ఒక విధానం అమలు అవుతుంది.

– సత్యనారాయణ, తహసీల్దార్, మోర్తాడ్

ఇందూరుకు సేవకుడినవుతా..



నగర శివారులోని బోర్గాం(పి) వద్ద ధన్‌పాల్ సూర్యనారాయణకు స్వాగతం పలుకుతున్న బీజేపీ కార్యకర్తలు

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- ఘనస్వాగతం పలికిన బీజేపీ శ్రేణులు

సుభాష్‌నగర్ : ఎన్నికల్లో తనను ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించిన ఇందూరు ప్రజలకు సేవకుడిగా ఉండి పని చేస్తానని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత మొదటిసారిగా నియోజకవర్గానికి విచ్చేసిన సూర్యనారాయణకు బీజేపీ నాయకులు, అభిమానులు, కుటుంబసభ్యులు బోర్గాం(పి) వద్ద ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాధవనగర్ సాయిబాబా ఆలయంలో, లక్ష్మీగణపతి ఆలయంలో పూజలు చేశారు. వినాయక్‌నగర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద, పులాంగ్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం బైక్ ర్యాలీగా బోర్గాం(పి), వినాయక్‌నగర్, పులాంగ్, గోల్‌హనుమాన్, పెద్దబజార్, నెహ్రూపార్క్, బస్టాండ్, ఎన్టీఆర్ చౌరస్తా మీదుగా అర్బన్ క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు. బోర్గాం(పి) వద్ద ఇందూరు గడ్డను ముద్దాడి.. రుణం తీర్చుకుంటానని హామీనిచ్చారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ ఇచ్చిన హామీలు నేరవేర్చి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాన్నారు. ప్రజల సహకారం ఉండాలన్నారు. అనంతరం అర్బన్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పూజలు చేశారు. అక్కడే కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ధన్‌పాల్ కుటుంబసభ్యులతో పాటు కార్పొరేటర్లు, నాయకులు గోపిడి స్రవంతిరెడ్డి, పంచరెడ్డి ప్రవళిక, లావణ్య, మాస్టర్ శంకర్, మెట్టు విజయ్, నాగోళ్ల లక్ష్మీనారాయణ, మంచాల జ్ఞానేందర్, విజయ్, వినోద్‌రెడ్డి, శ్రీధర్ కార్యకర్తలు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఎంపీ అర్వింద్
- లక్కోరలో లాంఛనంగా ప్రారంభం



యాత్రను ప్రారంభిస్తున్న ఎంపీ



వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా లక్కోరలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ అర్వింద్ అన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని శనివారం ఎంపీ జిల్లాలోని వేల్పూర్‌లోని లక్కోరలో ప్రారంభించారు. స్థానిక జిల్లా ప్రజా పరిషత్ ప్రభుత్వ సెకండరీ పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమానికి అర్వింద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలోని 530 జీపీల పరిధిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించేందుకు వీలుగా జిల్లా యంత్రాంగం ప్రత్యేక వాహనాలు, 7 బృందాలను ఏర్పాటు చేసింది. ఒక్కో బృందం 2,3 గ్రామాల్లో కేంద్ర పథకాలపై అవగాహన కల్పించనున్నారు. ఈ సందర్భంగా ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ 17 రకాల కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇల్లులేని పేదలు పీఎం ఆవాస్ యోజన పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకం ద్వారా ప్రతి ఏటా రూ.5 లక్షల ఆరోగ్య బీమా కేంద్రప్రభుత్వం అందిస్తోందన్నారు. జిల్లాలో 5 లక్షలకు పైగా లబ్ధిదారులున్నారన్నారు. జిల్లాలో 40 రోజులకు పైగా పీఎం మోదీ సంకల్ప్ యాత్ర వాహనం తిరుగుతుందని దాంతో పాటు అధికారులు ఉంటారన్నారు. అర్హులైన ఏదైనా పథకానికి తమ పేర్లు నమోదు చేసుకుంటే వాటిని ప్రభుత్వానికి పంపిస్తారన్నారు. ఇంటి నిర్మాణం, వైద్యం, స్వయం ఉపాధి, ముద్ర రుణం తదితరాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో చందర్ నాయక్, డీపీవో జయసుధ, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ రావు, డీఈవో దుర్గాప్రసాద్, డీఎంహెచ్‌వో డాక్టర్ సుదర్శనం, డీఐఈవో రఘురాజ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్, నాబార్డు డీడీఎం ప్రవీణ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రాకేశ్, డీఎల్పీవో శ్రీనివాస్, తహసీల్దార్ నాగార్జున, సర్పంచ్ వంశీకృష్ణ, ఎంపీటీసీ గంగామణి, బాల్కొండ నియోజవర్గ బీజేపీ ఇంచార్జ్ ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందేలా..

అదనపు కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఎలాంటి పరిమితి లేకుండా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి అందించాలన్నదే ప్రధాని మోదీ సంకల్పమన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాల కింద లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు, భూసార పరీక్ష ఫలితాల నిర్ధరణ కార్డులను పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ భారత్, ఉజ్వల భారత్, ఐసీడీఎస్ స్టాల్స్‌ను ఎంపీ పరిశీలించారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న పథకాల గురించి అధికారులు అవగాహన కల్పించారు. నానో ఎరువులతో కలిగే ప్రయోజనాల గురించి అధికారులు వివరించారు. అంతకుముందు వికసిత్ భారత్ సంకల్పయాత్రను వర్చువల్ ద్వారా ప్రారంభించిన ప్రధానమంత్రి మోదీ తన సందేశాన్ని అందించారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

బదిలీల కోసం పోలీసుల పైరవీలు

- బీఆర్‌ఎస్ హయాంలో ఎమ్మెల్యేల సిఫార్సులతో జిల్లాలో తిష్ట
- ప్రస్తుతం కొత్త పోస్టింగ్‌ల కోసం మళ్లీ నేతల వద్దకు..
- సిఫార్సులతో వచ్చిన వారిపై ఇంటెలిజెన్స్ ఆరా
- సీఎం రేవంత్‌రెడ్డి దృష్టిలో బోధన్ ఏసీపీ..!



ఖలీల్‌వాడి : జిల్లాలో ఏళ్లుగా తిష్ట వేసిన పోలీస్ అధికారులు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు పైరవీలు షురూ చేశారు. ప్రస్తుతం ఉన్నవాళ్లంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల సిఫార్సుల ద్వారా జిల్లాలో పోస్టింగ్ పొందారు. గతంలో అధికార పార్టీకి అండగా ఉండి ప్రతిపక్షపార్టీలపై కఠినంగా ఉండటంతో కొంత మంది పోలీసు అధికారులకు బదిలీ తప్పదనే ప్రచారం ఉంది. జిల్లాలోని 6 నియోజకవర్గంలో రెండు స్థానాల చొప్పున బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు గెలుపొందాయి. జిల్లాలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అప్పటి ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలతో ఎస్సైలు, సీఐలు, ఎస్‌హెచ్‌వోలు, ఏసీపీలు పోస్టింగ్ తీసుకున్నారు. ప్రస్తుతం కమిషనరేట్ పరిధిలో సిఫార్సుతో వచ్చినవారే విధుల్లో ఉన్నారు. పదిహేను రోజుల్లో జిల్లాలో పోలీసుల బదిలీలు జరుగుతాయనే చర్చ కొనసాగుతుంది.

సిఫార్సులతో వచ్చిన వారిపై ఆరా..

జిల్లాలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సిఫార్సుల్లో వచ్చిన పోలీసులకు సంబంధించిన వివరాల జాబితాను ప్రభుత్వం ఇంటెలిజెన్స్ అధికారుల ద్వారా తీసుకున్నట్లు తెలిసింది. వీరు పని చేసిన ప్రాంతంలో ప్రతిపక్షా పార్టీలపై వ్యవహరించిన తీరుపై జాబితాను తీసుకున్నట్లు సమాచారం. ఇటీవల అధికార పార్టీ ఎమ్మెల్యేను సీఐతో పాటు ఎస్సైలు వెళ్లి మర్యాద పూర్వకంగా కలవగా ఎన్నికల్లో అప్పటి అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించిన తీరుపై సదరు ప్రజాప్రతినిధి ప్రస్తావించడంతో పోలీసు అధికారులు ఖంగుతిన్నట్లు తెలిసింది.

బీజేపీ, కాంగ్రెస్ వద్ద పోలీసుల జాబితా

ఎన్నికల సమయంలో గత సీపీ సత్యనారాయణపై కాంగ్రెస్, బీజేపీ నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో సీపీ కల్మేశ్వర్‌కు ఎన్నికల సంఘం పోస్టింగ్ ఇచ్చింది. ఎన్నికలప్పుడు అధికార పార్టీకి అండగా ఉన్నారని ఎస్సై, సీఐలు, ఎస్‌హెచ్‌వోలు, ఏసీపీలకు సంబంధించిన జాబితాను కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలు ఎన్నికల అధికారులకు, సీపీ కల్మేశ్వర్‌కు జాబితాను అందించినట్లు తెలిసింది. వారికి బదిలీ తప్పదనే చర్చ జరుగుతోంది.

వ్యక్తిగత సెలవులో బోధన్ ఏసీపీ

ఎన్నికల సమయంలో ఎడపల్లిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పులిశ్రీనివాస్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలపై పోలీసులు లాఠీ ఛార్జీ చేసి కేసులు నమోదు చేశారు. అదే సమయంలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కామారెడ్డిలో జరిగిన సమావేశంలో బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్ పేరును తన రెడ్‌డైరీలో రాసుకున్నట్లు సమాచారం. డిసెంబర్ 2న జిల్లా పర్యటనకు వచ్చిన ప్రియాంకాగాంధీ భర్త రాబర్ట్ వాద్రాను కూడా కాంగ్రెస్ నాయకులు కలిసి సదరు పోలీసులపై ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. బోధన్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్, ఎస్‌హెచ్‌వో ప్రేమ్‌కుమార్ వ్యక్తిగత సెలవులో వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో బదిలీవేటు తప్ప దని భావించిన ఏసీపీ, ఎస్‌హెచ్‌వో వ్యక్తిగత సెలవులలో వెళ్లినట్లు పోలీస్‌వర్గాలలో ప్రచా రం జరుగుతుంది.

కొత్తవాళ్లు రాకముందే..

కొత్త పోలీస్ అధికారులు రాకముందే తామే ఏదో ఒక ప్రాంతానికి వెళ్లాలని ప్రస్తుతం ఉన్న పోలీస్ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో తాము పని చేసిన ప్రాంతాల్లో పని చేసిన కాంగ్రెస్ నేతలను కలిసి అవకాశం కల్పించాలని కోరుతున్నట్లు తెలిసింది. ఏ నియోజకవర్గంలో ఎవరు గెలిచారో తెలుసుకొని వారి వద్దకు వెళ్లి తమకు పోస్టింగ్ ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిసింది. గతంలో ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన పోలీసులు అధికారులు తమకు అనుకూలంగా ఉన్న కాంగ్రెస్ నేతల సహకారంలో మళ్లీ జిల్లాకు రావడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలి

- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



కామారెడ్డి టౌన్ : క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. కామారెడ్డి పట్టణంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి హాకీ క్రీడా పోటీలను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడానికి విద్యాశాఖ, ఎస్‌జీఎఫ్, వ్యాయామ ఉపాధ్యాయులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. హాకీకి తిరిగి పూర్వ వైభవం తీసుకురావడానికి క్రీడాకారులు నిరంతరం ప్రయత్నం చేయాలని సూచించారు. పది ఉమ్మడి జిల్లాలకు చెందిన 405 మంది క్రీడాకారులు ఈ టోర్నమెంట్లో పాల్గొన్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నాయబ్ రసూల్ తెలిపారు. కార్యక్రమంలో డీఈవో రాజు, జిల్లా యువజన, క్రీడల సంక్షేమ అధికారి దామోదర్ రెడ్డి, కౌన్సిలర్లు నరేందర్, శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి: రాష్ట్ర మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల/ కళాశాల–4 (నిజామాబాద్‌)లో పనిచేసేందుకు అర్హులైన పీఈటీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్‌ రణవీర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం డిచ్‌పల్లి మండలం ధర్మారం (బి)లో కొనసాగుతున్న ఈ పాఠశాల/కళాశాలలో పీఈటీ కోసం బీపీఈడీ అర్హత గల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 19న సాయంత్రంలోగా అందజేయాలని సూచించారు.

నిందితుల ఆస్తుల జప్తునకు ఆదేశం

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో ఓ వ్యక్తి నుంచి బంగారాన్ని అపహరించిన నిందితుల ఆస్తుల జప్తునకు కోర్టు ఆదేశించినట్లు రైల్వే ఎస్సై తావునాయక్‌ శనివారం తెలిపారు. 2015లో ఓ వ్యక్తి నుంచి బంగారాన్ని అపహరణ చేసిన ట్రాన్స్‌జెండర్స్‌ నిజామాబాద్‌, సంగారెడ్డి జిల్లాకు చెందిన వారని ఎస్సై చెప్పారు. జిల్లా కేంద్రంలోని దుబ్బకు చెందిన తాళ్లమురళి అలియాస్‌ మీనా, గుమ్ముల లక్ష్మీనారాయణ అలియాస్‌ రాణితోపాటు సంగారెడ్డి జిల్లాకు చెందిన మడిగి మహేందర్‌ అలియాస్‌ మహేశ్వరిలను అరెస్ట్‌ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. నాటి నుంచి నేటి వరకు కోర్టు వాయిదాలకు వారు హాజరు కాకపోవడంతో ఆస్తుల జప్తునకు కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రాంతానికి చెందిన తహసీల్దార్‌ వీరిపై ఉన్న ఆస్తుల వివరాలు కోరగా ఎలాంటి ఆస్తులు లేవని ధ్రువీకరించినట్లు తెలిపారు. వీరి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే 8712658591, 0846222652, 8712513824 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్‌ అధ్యక్షుడిగా అశోక్‌


గంట అశోక్‌

వేల్పూర్‌: పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా కొనసాగిన గంట అశోక్‌ రాష్ట్ర అసోసియేట్‌ అధ్యక్షుడిగా శనివారం నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన తన నియామకాన్ని వెల్లడించారు. ఉపాధ్యాయుల సమస్యలు తీర్చడానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు.

హనుమాన్‌ ఆలయ హుండీ లెక్కింపు



నిజామాబాద్‌ సిటీ: నగర శివారులోని సారంగపూర్‌ హనుమాన్‌ ఆలయం హుండీ కానుకలను శనివారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు లెక్కించారు. శాఖ పరిశీలకురాలు కమల, మఠం ఫిట్‌ పర్సన్‌ వేణు, 6వ టౌన్‌ పోలీసుల సమక్షంలో సిబ్బంది హుండీను తెరిచారు. గత మూడు నెలల నుంచి హుండీలో భక్తులు వేసిన కానుకలు మొత్తం రూ.1,36, 735 వచ్చినట్లు పరిశీలకురాలు కమల తెలిపారు. ఏఎస్సై ఈశ్వర్‌, సిబ్బంది ప్రశాంత్‌, మకరంద్‌, న్యాయవాది రామాగౌడ్‌, సోమలింగా గౌడ్‌, వెంకటేశ్‌, భక్తులు పాల్గొన్నారు.

పీడీఎస్‌ బియ్యం పట్టివేత

రామారెడ్డి: మండల కేంద్రం అక్రమంగా నిల్వ చేసిన పీడీఎస్‌ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సుధాకర్‌ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన శంకర్‌ ఇంట్లో అక్రమంగా పీడీఎస్‌ బియ్యం నిల్వ ఉన్నట్లు సమాచారం అందడంతో దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో 7 క్వింటాళ్ల 60 కిలోల పీడీఎస్‌ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బిల్లులు చెల్లించండి మహాప్రభో..

- పట్టణ అభివృద్ధికి రూ. 8 కోట్ల మేర ఖర్చు పెట్టాం
- బిల్లులు చెల్లించాలని ప్రభుత్వానికి కాంట్రాక్టర్ల వేడుకోలు



బోధన్‌టౌన్‌: అప్పులు చేసి మరీ పనులు చేపట్టాం.. గత రెండేళ్లుగా బిల్లులు మంజూరు కాక చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడుతున్నాం వాటిని చెల్లించండి మహాప్రభో అని కాంట్రాక్టర్లు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. గత ప్రభుత్వం చేపట్టిన రెండో విడత పట్టణ ప్రగతి, పలు అభివృద్ధి పనులకు సంబంధిత కాంట్రాక్టర్లు రూ. 8 కోట్ల మేర ఖర్చు పెట్టారు. బోధన్‌ మున్సిపల్‌ పరిధిలో 38 వార్డులు ఉన్నాయి. ఈ వార్డులతో పాటు బల్దియా పరిధిలో ప్రభుత్వం చేపట్టే వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు 25 మంది కాంట్రాక్టర్లు ఉన్నారు. వీరు ఏళ్ల తరబడి బల్దియా పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులు చేపడుతున్నారు. గడిచిన రెండేళ్ల నుంచి పట్టణ ప్రగతితో పాటు 15వ ఆర్థిక సంఘం నిధులతో బల్దియా అధికారులు అప్పగించిన వైకుంఠధామాల అభివృద్ధి, సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీల నిర్మాణాలు, ప్రహరీ నిర్మాణ పనులకు వేసిన టెండర్లను దక్కించుకొని పనులు పూర్తి చేశారు. చేసిన అభివృద్ధి పనులకు ఎంబీ రికార్డులు సైతం పూర్తి చేసి అకౌంట్‌ సెక్షన్‌లో అప్పగించారు. అయినా రెండేళ్ల నుంచి బిల్లులు మంజూరుకాక పోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడుతున్నారు. ఐరన్‌, సిమెంట్‌, ముడిసరుకుల యజమానులకు బిల్లులు చెల్లించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. బిల్లులను త్వరగా చెల్లించాలంటూ మున్సిపల్‌ కమిషనర్‌, చైర్‌పర్సన్‌కు మొర పెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. కార్యాలయం,అధికారుల చుట్టూ కాళ్లు అరిగేదాక తిరిగినా ఫలితం లేకుండా పోవడంతో కార్యాలయం ఎదుట ధర్నాలు చేసి అధికారులకు వినతిపత్రాలు అందించారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రస్తుత కాంగ్రెస్‌ ప్రభుత్వం బిల్లులు చెల్లించి ఆదుకోవాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

కాంట్రాక్టర్లను ఆదుకోవాలి

బోధన్‌ మున్సిపల్‌ పరిధిలోని పలు వార్డుల్లో గత ప్రభుత్వ చేపట్టిన పలు అభివృద్ధి పనులను చేపట్టి పూర్తి చేశాం. రెండేళ్లు అవుతోంది ఇప్పటి వరకు బిల్లులు మంజూరు కాలేదు. ప్రభుత్వం స్పందించి బిల్లులు మంజూరు చేసి కాంట్రాక్టర్లను ఆదుకోవాలి.

– ఉదయ్‌ భాస్కర్‌, బోధన్‌ మున్సిపల్‌ కాంట్రాక్ట్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు

బిల్లులను మంజూరు చేయాలి

మున్సిపల్‌ పరిధిలోని పలు వార్డుల్లో గత ప్రభుత్వ హయాంలో 15వ ఆర్థిక సంఘం, పట్టణ ప్రగతిలో భాగంగా అభివృద్ధి పనులు చేపట్టాం. పలు చోట్ల అప్పులు చేసి మరి అధికారులు నిర్దేశించిన కాలంలో పనులు పూర్తి చేశారు. బిల్లులను మంజూరు చేసి కాంట్రాక్టర్లను ఆదుకోవాలి.

– జెమ్స్‌, కాంట్రాక్టర్‌

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

గత ప్రభుత్వ హయాంలో మున్సిపల్‌ పరిధిలో కాంట్రాక్టర్లు చేసిన పలు అభివృద్ధి పనుల బిల్లుల మంజూరు అంశాన్ని సంబంధిత ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. బిల్లుల మంజూరు కోసం చర్యలు చేపడుతాం.

– ఖమర్‌ అహ్మద్‌, మున్సిపల్‌ కమిషనర్‌

స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి



అభ్యర్థులకు ధ్రువపత్రం అందజేస్తున్న శాంసన్‌, శ్రీనివాస్‌

డిచ్‌పల్లి: శిక్షణ పొంది అభ్యర్థులు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని ఎస్‌బీఐ ఏవో చీఫ్‌ మేనేజర్‌ ఎం.శ్యాంసన్‌ సూచించారు. మండలంలోని ఆర్‌ఎస్‌ఈటీఐలో శనివారం నిర్వహించిన ఎలక్ట్రీషియన్‌ బ్యాచ్‌ శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై అభ్యర్థులకు ధ్రువపత్రాలు, టూల్‌ కిట్లు అందజేశారు. ఎలక్ట్రీషియన్‌ కోర్సుకు మార్కెట్‌లో ఎప్పుడూ డిమాండ్‌ ఉంటుందన్నారు. బ్యాంకు ద్వారా రుణాలు కావాల్సిన వారు ఎస్‌బీఐ బ్రాంచ్‌ను సంప్రదించాలని సూచించారు. డిచ్‌పల్లి ఎస్బీఐ బ్రాంచ్‌ మేనేజర్‌ ప్రదీప్‌ మాట్లాడుతూ.. పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవైను ప్రతి ఒక్కరూ ఉపయోగించు కోవాలన్నారు. అనంతరం సంస్థ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్‌ ఎస్‌.శ్రీనివాస్‌, సిబ్బంది భాగ్యలక్ష్మి, రామకృష్ణ, రంజిత్‌, నవీన్‌, రవి తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు ఆటల పోటీలు



నిజామాబాద్‌నాగారం: నగరంలోని నాందేవ్‌వాడలో ఉన్న మల్లు స్వరాజ్యం ట్రస్ట్‌ భవనంలో పెన్షనర్లకు ఆటల పోటీలను నిర్వహించినట్లు జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌ రావు తెలిపారు. తెలంగాణ ఆల్‌ పెన్షనర్స్‌ అండ్‌ రిటైర్డ్‌ పర్సన్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలను జిల్లా గౌరవ అధ్యక్షుడు శాస్త్రుల దత్తాత్రేయ రావు ప్రారంభించారు. ఈ నెల 19న పెన్షనర్స్‌ దినోత్సవం సందర్భంగా శని, ఆదివారాలలో ఆటలు పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుదం మదన్‌మోహన్‌, ఈవిల్‌ నారాయణ, హనుమాన్లు, అందె సాయిలు, ప్రసాద్‌ రావు, లావు వీరయ్య, దీకొండ లక్ష్మీనారాయణ, సిర్పలింగం, వెంకటరావు, నాయకులు పాల్గొన్నారు.

పే స్కేల్‌కు ముడుపుల ముడి..

- ముడుపుల విషయంపై సామాజిక మాధ్యమాల్లో ఉద్యోగుల చర్చ

మోర్తాడ్‌: న్యాయబద్ధమైన తమ హక్కులను సాధించుకోవడానికి ముడుపులు ఇవ్వక తప్పని పరిస్థితి ఏర్పడిందని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్‌) ఉద్యోగులు వాపోతున్నారు. గత ప్రభుత్వ పెద్దలు, కొందరు ఉన్నతాధికారులు అడిగినంత ఇచ్చినా పే స్కేల్‌ అమలులో సరైన న్యాయం జరుగలేదని ఉద్యోగులు సామాజిక మాధ్యమాలల్ల చర్చించుకుంటున్నారు. గత ప్రభుత్వం దిగిపోయి కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో సెర్ప్‌ ఉద్యోగులు ఇప్పుడు గత ప్రభుత్వ పనితీరును తప్పుపడుతూ గత పది రోజుల నుంచి పే స్కేల్‌ అమలులో చోటు చేసుకున్న నాటకీయ పరిణామాలపై చర్చించుకోవడం గమనార్హం. సెర్ప్‌ సంస్థలో కమ్యునిటీ కో–ఆర్డినేటర్లు, ఏపీఎం, డీపీఎం, ఏపీడీలు అందరూ గతంలో కాంట్రాక్టు పద్ధతిన నియమించిన వారే. రాష్ట్ర వ్యాప్తంగా 3వేల వరకు ఉండగా మన జిల్లాలో 216 మంది ఉన్నారు. పే స్కేల్‌ అమలు చేసినా ఉద్యోగుల క్యాడర్‌ను తగ్గించడంతో తాము ఆశించిన వేతనం లభించడం లేదన్నారు. సీసీలను జూనియర్‌ అసిస్టెంట్‌, ఏపీఎంలను సీనియర్‌ అసిస్టెంట్‌, డీపీఎంలను సూపరింటెండెంట్‌, ఏపీడీలను ఎంపీడీవో స్థాయి అధికారులుగా గుర్తించారు. క్యాడర్‌ గుర్తింపులో తేడా స్పష్టంగా ఉండటంతో పే స్కేల్‌ వర్తించినా ఆశించిన వేతనం దక్కడం లేదని ఉద్యోగులు పేర్కొంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెద్దమొత్తంలో వసూలు చేసిన ఉద్యోగ సంఘం ప్రతినిధులు క్యాడర్‌ గుర్తించడంలో న్యాయం జరిగే విధంగా ప్రభుత్వంపై వత్తిడి తీసుకురాలేదని ఉద్యోగులు అంటున్నారు. ఏది ఏమైనా గత ప్రభుత్వ హాయంలో చోటు చేసుకున్న పరిణామాలు కొత్త ప్రభుత్వంలో ఎలాంటి పరిస్థితులకు దారి తీస్తుందో వేచి చూడాలి.

మగవారికి సీట్లు కేటాయించాలి

ఆర్మూర్‌టౌన్‌: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించడంతో మగవారికి సీట్లు దొరకడం లేదని, కొన్ని సీట్లు కేటాయించాలని ఓ యువకుడు ఆందోళన చేశాడు. ఆర్మూర్‌ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ ఎదుట ఆర్మూర్‌కు చెందిన వాసు శనివారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్‌ ఎదుట నిలబడి ఆందోళనకు దిగాడు. బస్సుల్లో మగవారికి సైతం ఉచిత ప్రయాణం కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఆందోళనతో కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

పీఈటీలు మరింత సాధన చేయాలి



నిజామాబాద్‌నాగారం: పీఈటీలు మరింత సాధన చేస్తే క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభ బయటకు వస్తుందని జాతీయస్థాయి అథ్లెటిక్స్‌ గోల్డ్‌మెడలిస్టు సయ్యద్‌ఖైసర్‌ అన్నారు. నగరంలోని రాజారాం స్టేడియంలో జిల్లా అథ్లెటిక్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో అథ్లెటిక్‌ పోటీలను శనివారం నిర్వహించారు. ఆయా విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను మెడల్స్‌ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నరాల రత్నాకర్‌, కార్యదర్శి రాజాగౌడ్‌, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

శెట్‌పల్లిలో పోలీసు పికెట్‌

మోర్తాడ్‌: మండలంలోని శెట్‌పల్లిలో గురుజాల రాము అనే వ్యక్తి కుటుంబాన్ని గ్రామ కమిటీ సాంఘిక బహిష్కరణ విధించడం, వీడీసీ సభ్యులపై కేసు నమోదు చేయడం వివాదానికి దారితీసింది. గ్రామంలో అలజడి జరుగకుండా పోలీసులు పికెట్‌ ఏర్పాటు చేశారు. రాము అనే వ్యక్తి కుటుంబం విషయంలో పంచాయితీ నిర్వహించి ఆయన కుటుంబానికి సాంఘిక బహిష్కరణ విధించగా అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వీడీసీ సభ్యులపై కేసు నమోదు చేసి వారి కోసం గాలిస్తున్నారు. గ్రామంలో ఎలాంటి అలజడి జరుగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నారు.

క్రైం కార్నర్‌

బస్సు ఢీకొని ఒకరి మృతి


రమేశ్‌ మృతదేహం

ఆర్మూర్‌టౌన్‌: పెర్కిట్‌ శివారులో జాతీయ రహదారిపై ఓ ప్రైవేట్‌ బస్సు సైకిల్‌ను ఢీకొనడంతో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై అశోక్‌ పేర్కొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. చేపూర్‌ గ్రామానికి చెందిన రమేశ్‌ (67) పెర్కిట్‌ సబ్‌స్టేషన్‌లో నైట్‌ వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం ఉదయం విధులు ముగించుకొని చేపూర్‌కు సైకిల్‌పై వెళ్తుండగా నిర్మల్‌ నుంచి హైదరాబాద్‌ వెళ్తున్న ప్రైవేట్‌ బస్సు ఢీకొన్నది. ఈ ఘటనలో రమేశ్‌ అక్కడిక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడి కుమారుడు వినాయక్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బావిలో పడి ఒకరు..


చిన్న గంగారాం(ఫైల్‌)

డొంకేశ్వర్‌: నూత్‌పల్లి శివారులోని వ్యవసాయ బావిలో పడి ఆలూర్‌ మండలం కల్లెడకు చెందిన కొండ్ర చిన్న గంగారాం (65) మృతి చెందాడు. ఎస్సై రాహుల్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మతిస్థిమితం సరిగాలేని గంగారాం ఈ నెల 12న కల్లెడలోని ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం డొంకేశ్వర్‌ మండలం నూత్‌పల్లి వ్యవసాయ బావిలో శవమై కనిపించాడు. తండ్రి మృతిపై తమకు ఎలాంటి అనుమానం లేదని, కాలకృత్యాలకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడినట్లుగా కొడుకు కొండ్ర మధు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

నీట మునిగి ఒకరు..


ప్రసాద్‌ మృతదేహం

నిజాంసాగర్‌(జుక్కల్‌): కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెరువులో దిగిన కుర్మ ప్రసాద్‌(43) ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందినట్లు జుక్కల్‌ ఎస్సై సత్యనారాయణ శనివారం తెలిపారు. జుక్కల్‌ మండలం లాడేగావ్‌ గ్రామానికి చెందిన ప్రసాద్‌ వ్యవసాయ కూలీ పనులు చేస్తు జీవిస్తుంటాడు. శుక్రవారం కూలీ పనులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెరువుకు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడి భార్య నాగులదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెరువులో మృతదేహం లభ్యం

మాక్లూర్‌: అదృశ్యమైన వ్యక్తి మృతదేహం స్థానిక చెరువులో లభ్యమైనట్లు ఎస్సై సుధీర్‌రావు శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మాణిక్‌బండార్‌కు చెందిన దేదావత్‌బాబు(32) ఈ నెల 14న అదృశ్యమయ్యాడు. కుటుంబీకులు పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. చెరువులో మృతదేహం ఉందన్న సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

తప్పిపోయి రెండేళ్లు దాటింది

- కామారెడ్డి బాలరక్ష భవన్‌లో దోమకొండ బాలిక శ్వేత


బాలిక శ్వేత

కామారెడ్డి క్రైం: రెండేళ్ల క్రితం సంగారెడ్డి జిల్లా పటాన్‌ చెరువు ప్రాంతంలోని ఇస్నాపూర్‌ సాంఘిక సంక్షేమ గురుకుల హాస్టల్‌ వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఓ బాలికను వదిలి వెళ్లాడు. రోదిస్తున్న బాలికను చూసి స్థానికులు సమాచారం అందించగా పోలీసులు సదరు బాలికను అమీన్పూర్‌లోని మహిమ మినిస్ట్రీలో చేర్పించారు. బాలికను విచారించగా తన పేరు శ్వేత అలియాస్‌ రేణుక అని తన తల్లిదండ్రుల పేర్లు సంధ్య, ప్రభాకర్‌రెడ్డి అని, తమది దోమకొండ గ్రామం అని చెప్పింది. అంతే కాకుండా తన అక్క పేరు సరిత, బావ పేరు వెంకటరెడ్డి, వారు కామారెడ్డిలో ఉంటారని పోలీసులతో చెప్పింది. రెండేళ్లుగా అక్కడే ఉన్న సదరు బాలికను అధికారులు రెండు నెలల క్రితం కామారెడ్డి బాలరక్ష భవన్‌కు అప్పగించారు. ప్రస్తుతం ఆమె ఇక్కడే ఆశ్రయం పొందుతున్నట్లు ఐసీడీఎస్‌ పీడీ బావయ్య, జిల్లా బాలల సంరక్షణ అధికారిణి స్రవంతి తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే ప్రియా థియేటర్‌ రోడ్డులో ఉన్న బాల రక్ష భవన్‌కు వచ్చి సంప్రదించాలని కోరారు.

నేరస్తులకు శిక్షపడేలా చూడాలి


మాట్లాడుతున్న లక్ష్మీనర్సయ్య

ఖలీల్‌వాడి: సరైన సాక్ష్యాలతో నేరస్తులకు శిక్షపడేలా తగు చర్యలు తీసుకోవాలని పబ్లిక్‌ ప్రాసిక్యూటర్లతో డిప్యూటీ డైరెక్టర్‌ ఆఫ్‌ ప్రాసిక్యూషన్‌ పి. లక్ష్మీనర్సయ్య సూచించారు. ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలోని కోర్టులో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్‌ ప్రాసిక్యూటర్లతో శనివారం సమీక్ష నిర్వహించారు. ప్రతి పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ తన విధులను శ్రద్ధతో నిర్వహించి, నేరస్తులకు శిక్షపడేలా కృషి చేయాలని కోరారు. సమావేశంలో పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ రవిరాజ్‌, రాజారెడ్డి, బంటు వసంత్‌, నందయమేకు, జి.శ్యాంరావు, కావేటి శేషు, అదనపు పబ్లిక్‌ ప్రాసిక్యూటర్లు ఖాందేశ్‌ శ్రీనివాస్‌, నిమ్మ దామోదర్‌రెడ్డి, డాక్టర్‌ పి. సామయ్య, మహ్మద్‌ రహీముద్దీన్‌, డి. వీరయ్య, భూసారపు రాజేశ్‌ గౌడ్‌, నాయక్‌, చిదిరాల రాణి, పారిక రాజేశ్వరి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి


కొండూరులో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్‌ దాదన్నగారి విఠల్‌రావు

నందిపేట్‌(ఆర్మూర్‌) : ప్రజల అభివృద్ధి కో రుతూ కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సబ్సి డీ పథకాల లబ్ధి కోసం చేపట్టిన వికసిత్‌ భా రత్‌ సంకల్ప యాత్రను శనివారం నందిపేట లోని చౌడమ్మ కొండూరులో అధికారికంగా ప్రారంభించారు. సర్పంచ్‌ దమ్మన్న గారి ప్ర భాకర్‌ అధ్యక్షతన గౌరవ అధ్యక్షులుగా జిల్లా పరిషత్‌ చైర్మన్‌ దాదన్న గారి విఠల్‌రావు, జెడ్పీ సీఈవో గోవింద్‌నాయక్‌ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులందరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు రాజు, ఎమ్మార్వో ఎంపీడీవో, ఎంపీడీవో కిరణ్‌, ఎంఈవో శ్రీనివాస్‌ రెడ్డి, ఏపీఎం మాణిక్యం, వెటర్నరీ హనుమంత్‌ రెడ్డి, అగ్రికల్చర్‌ జోత్స్న భవాని, బ్యాంక్‌, పంచాయతీ, ఆరోగ్య తదితర శాఖల అధికారులు, గ్రామ ప్రజలు యువకులు పాల్గొన్నారు.

రుణాలతో ఆర్థికంగా ఎదగాలి


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న లబ్ధిదారులు

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రుణాలు తీసుకొని ఆర్థికంగా ఎదగాలని ఎంఎస్‌ఎంఈ డీఎఫ్‌ఓ రాజేశ్‌కుమార్‌ అన్నారు. నగరంలోని స్నేహసొసైటీ ఆవరణలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఎంఎస్‌ఎంఈ, పీఎంఈజీపీ ద్వారా వచ్చే రుణాలపై ఎస్సీ, ఎస్టీలకు శనివారం అవగాహన కల్పించారు. ఎంఎస్‌ఎంఈ ద్వారా ముద్ర లోన్‌లు రూ. 10 లక్షలు, పీఎంఈజీపీ ద్వారా తయారీ రంగానికి రూ. 50లక్షల వరకు అందిస్తున్నట్లు తెలిపారు. రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో స్నేహసొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, ప్రోగ్రాం మేనేజర్‌ మొహిజ్‌, కోఆర్డినేటర్‌ విమల తదితరులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

- ఒకరి పరిస్థితి విషమం, ఇద్దరికి గాయాలు



జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని ఎస్సై తిరుపతి శనివారం తెలపారు. జక్రాన్‌పల్లికి చెందిన పూజారి భూమన్న తన కూతురు మనీషాతో కలిసి టీవీఎస్‌ ఎక్సెల్‌పై పని నిమిత్తం అర్గుల్‌ బ్యాంకుకు వెళ్లారు. బ్యాంకులో పని ముగించుకుని జక్రాన్‌పల్లికి రాంగ్‌ రూట్‌లో వస్తుండగా వారికి ఎదురుగా వస్తున్న మరో బైక్‌ వీరిని ఢీకొన్నది. ఈ ఘటనలో మనీషా తలకు బలమైన గాయం కావడంతో జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మరో ఇద్దరికి గాయాలైనట్లు పేర్కొన్నారు. హైవే అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సుష్టి వద్దన్నందుకు దాడి

భిక్కనూరు: మండలంలోని మొటాట్‌పల్లిలో సుష్టి పట్టవద్దన్నందుకు పెద్దమామ ఇంటిపై ఇల్లరికం వచ్చిన అల్లుడు దాడి చేసినట్లు ఎస్సై సాయికుమార్‌ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన సాయిలు కుమార్తె శిరీషను వెంకటేశ్‌తో వివాహం చేసి ఇల్లరికంగా తెచ్చుకున్నాడు. ఇటీవల సాయిలుకు చెందిన దాయదులు (పాలోళ్లు) స్వామి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో పలువురు, పెద్దమామ నర్సింహులు సుష్టి పట్టవద్దని చెప్పారు. తమను సుష్టి ఎందుకు పట్టొద్దంటున్నారంటు పెద్దమామపై శుక్రవారం రాత్రి గొడవ పడ్డాడు. గొడవలో నర్సింహులు భార్య శ్యామలపై, దాడిని అడ్డుకునేందుకు యత్నించిన నరేశ్‌పై వెంకటేశ్‌, సాయిలు దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తండ్రి, సోదరిపై..

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డిలో తండ్రితో పాటు సోదరిపై ఇద్దరు సోదరులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు ఎస్సై సాయికుమార్‌ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన దాత్రిక విశ్వనాథం ఆయన కుమార్తె కాలేవర్‌ శోభను ఆయన ఇద్దరు కుమారులు లింగం, రాములు శుక్రవారం రాత్రి దాడి చేశారు. పాత గొడవలను దృష్టిలో ఉంచుకొని లింగం, రాములు కర్రతో తండ్రి విశ్వనాథం, సోదరి శోభపై దాడి చేశారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఫత్లాపూర్‌లో వ్యక్తి అదృశ్యం


కామయ్య

బిచ్కుంద: మండలంలోని ఫత్లాపూర్‌లో బంధువుల ఇంటికి వచ్చిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై మురళి శనివారం తెలిపారు. నసురుల్లాబాద్‌ మండలం బొమ్మన్‌దేవ్‌ గ్రామానికి చెందిన నీరడి కామయ్య ఈ నెల 10న ఫత్లాపూర్‌లో ఉన్న బంధువుల ఇంటికి వచ్చాడు. 12న వారి ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు, బంధువులు పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. కామయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వివాహిత ..

మాక్లూర్‌: మండలంలోని ఓ తండాకు చెందిన వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై సుధీర్‌రావు శనివారం తెలిపారు. తండాకు చెందిన వివాహిత ఈ నెల 14న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మొరం టిప్పర్లకు జరిమానా

నస్రుల్లాబాద్‌: మండలంలోని రాములగుట్ట తండాలో అక్రమంగా మొరం తరలిస్తున్న నాలుగు టిప్పర్లను, రెండు జేసీబీలను తహసీల్దార్‌ రాజు శనివారం పట్టుకొని సీజ్‌ చేశారు. వాల్టా చట్టం ప్రకారం టిప్పర్లు, జేసీబీ నిర్వాహకులకు రూ.40వేలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. అనుమతి లేకుండా మొరం తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్‌కు..

రుద్రూర్‌: పోతంగల్‌ మండల కేంద్రంలో అనుమతి లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ యజమానికి రూ. మూడు వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్‌ రమేశ్‌ శనివారం తెలిపారు. ఎవరైనా అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.